ప్రజా విశ్వంభర

## 'మహావతార్ నరసింహ'..

# పాకిస్థాన్‌లోనూ ప్రశంసలు!




భారీ తారాగణం, పెద్ద ప్రచార ఆర్భాటం లేకుండానే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన భారత యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ' ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఏకంగా రూ.300 కోట్ల వసూళ్లు సాధించి రికార్డు సృష్టించిన ఈ సినిమా... 98వ ఆస్కార్ అవార్డుల బరిలో నిలిచింది. హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రానికి అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. విడుదలైన తొలి రోజు నుంచే మౌత్ టాక్‌తో అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఆధునిక యానిమేషన్ టెక్నాలజీతో నరసింహ పురాణం, విష్ణు పురాణంలోని ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపించడంతో ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. థియేటర్లలోనే కాకుండా, నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన తర్వాత కూడా ఈ చిత్రం రికార్డు స్థాయిలో వ్యూస్ దక్కించుకుంది.

ప్రస్తుతం 98వ ఆస్కార్ అవార్డుల కోసం 'ఉత్తమ యానిమేషన్ ఫిల్మ్' కేటగిరీలో పోటీ పడుతున్న 35 చిత్రాల ప్రాథమిక జాబితాలో 'మహావతార్ నరసింహ' చోటు దక్కించుకుంది. జనవరి 22న ప్రకటించే తుది నామినేషన్లలో ఈ చిత్రం ఎంపికైతే, ఆస్కార్‌కు నామినేట్ అయిన తొలి భారతీయ యానిమేషన్ చిత్రంగా చరిత్ర సృష్టిస్తుంది. మరోవైపు, 'హోంబౌండ్' చిత్రం ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో భారత్ తరఫున అధికారిక ఎంట్రీగా పోటీలో ఉన్న సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో, ఇటీవల ఈ చిత్రాన్ని పాకిస్థాన్‌లోని కరాచీ స్వామి నారాయణ దేవాలయంలో ప్రదర్శించడం విశేషం. ఈ ప్రదర్శనకు వందలాదిగా తరలివచ్చిన పాకిస్థానీ హిందువులు, వెండితెరపై నరసింహస్వామి కథను చూసి భావోద్వేగానికి గురయ్యారు. పురాణాల ప్రకారం, హిరణ్యకశ్యపుడి స్వస్థలం నేటి పాకిస్థాన్‌లోని ముల్తాన్ అని, నరసింహావతారం అక్కడే జరిగిందని స్థానిక పండితులు చెబుతుండటం ఈ సందర్భంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## నటన అంటే ఉద్యోగం కాదు..

# 8 గంటల పని వివాదంపై రానా సంచలన కామెంట్స్



ఇండస్ట్రీలో పనిగంటలపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. తాను రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేస్తానని బాలీవుడ్ నటి దీపికా పదుకొణే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. మిగతా రంగాల తరహాలోనే ఇండస్ట్రీలోనూ నిర్ణీత పని గంటలు ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై తాజాగా టాలీవుడ్ నటుడు దగ్గుబాటి రానా స్పందించారు. నటన అంటే ఉద్యోగం కాదని చెప్పారు. ఇన్ని గంటలే చేయాలని నిర్వచించడం కష్టమన్నారు. రోజుకు 8 గంటలు కదలకుండా కూర్చొని పనిచేస్తే అద్భుతమైన ఔట్ పుట్ రావడానికి యాక్టింగ్ అనేది ప్రాజెక్ట్ కాదని వ్యాఖ్యానించారు. నటన అనేది ఓ లైఫ్ స్టైల్ అని, నటులు దీనిని నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ లైఫ్ స్టైల్ కొనసాగించాలా? వద్దా? అనేది పూర్తిగా ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిందేనని చెప్పారు. మిగతా రంగాలతో పోలిస్తే సినిమా రంగం భిన్నమైందని రానా గుర్తుచేశారు. ఇండస్ట్రీలో ప్రతీ విభాగంలోనూ నటీనటులు భాగమైతేనే గొప్ప సన్నివేశాలు వస్తాయని రానా పేర్కొన్నారు.

## బాలయ్యతో డ్యాన్స్ అంటే...

# అలా ఉంటది మరి..!



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో తెరకెక్కిన 'అఖండ 2: తాండవం' ఈ శుక్రవారం విడుదలకు సిద్ధమైంది. బోయపాటి శ్రీను రూపొందించిన ఈ చిత్రంలో తన పాత్ర అత్యంత కీలకమైందని, అందుకే గోప్యత పాటిస్తున్నామని హీరోయిన్ సంయుక్త మీనన్ తెలిపారు. 500 మంది డ్యాన్సర్లతో చేసిన మాస్ పాట తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందని చెప్పింది. బాలకృష్ణతో పనిచేయడం ఎంతో సౌకర్యంగా అనిపించిందని, ఆయన డైరెక్టర్ హీరో అని సంయుక్త అన్నారు. ప్రస్తుతం 'స్వయంభూ', 'నారీ నారీ నడుమ మురారి', పూరి జగన్నాథ్–విజయ్ సేతుపతి సినిమాల్లో ఆమె నటిస్తున్నారు.

మలయాళంలో 'పాప్‌కార్న్' (2016) ద్వారా హీరోయిన్‌గా ప్రయాణం ప్రారంభించిన సంయుక్త మీనన్ చాలా తక్కువ కాలంలోనే సౌత్‌లోని నాలుగు పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తమిళంలో 'కలరి', తెలుగులో 'భీమ్లా నాయక్', కన్నడలో 'గాలిపట 2' వంటి చిత్రాలతో ఆమె నటన ప్రేక్షకులకు చేరింది. కథే తనకు ముఖ్యమని, ఆ కథలోని భావోద్వేగం ప్రేక్షకుల హృదయాల్లో నాటుకుంటేనే నటిగా తన ప్రయాణం సార్థకమవుతుందని ఆమె నమ్మకం. ఇలాంటి దృఢమైన నమ్మకంతోనే ఇటీవల వరుస విజయాలను అందుకుంటూ ముందుకెళ్తోంది ఈ మలయాళ బ్యూటీ.

సంయుక్త మీనన్ బాలకృష్ణ–బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన ' అఖండ 2 : తాండవం'లో ఓ కీలక పాత్రలో నటించింది. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ భారీ యాక్షన్ డ్రామా ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్లలో భాగంగా సంయుక్త హైదరాబాదులో మీడియాతో మాట్లాడారు. సినిమాలో తన పాత్రపై ఎందుకంత గోప్యత అని ప్రశ్నించగా "బోయపాటి గారు ఎవరికి చెప్పొద్దని ఖచ్చితంగా సూచించారు. అంత ప్రాముఖ్యమైన పాత్ర ఇది. స్టైలిష్ లుక్‌లో కనిపిస్తా. నా పాత్ర చుట్టూ ఓ బలమైన సీక్వెన్స్ నడుస్తుంది. ఆ ప్రభావం థియేటర్‌లో ప్రేక్షకులు స్వయంగా అనుభవించాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు.

ఈ ప్రాజెక్ట్ ఎలా దక్కిందని అడిగితే—"బోయపాటి గారి నుంచి కాల్ వచ్చింది. వెంటనే ఇది 'అఖండ 2' గురించే అని అర్థమైంది. అప్పటికే నా డేట్స్ ఫుల్ అయిపోయాయి. అయినా సరే ఈ సినిమా తప్పకుండా చేయాలని అనిపించింది. కథ విన్న వెంటనే సినిమాకి ఉన్న భారీ స్కేలు అర్థమైంది. కానీ స్క్రీన్‌పై చూసిన తర్వాత ఆయన విజన్ అసలు ఊహించలేనంత భారీగా ఉంది" అని చెప్పింది.

సంయుక్త ఈ సినిమాలో తొలిసారి ఓ మాస్ డ్యాన్స్ నెంబర్ చేసి ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరచనున్నారు. "500 మంది డ్యాన్సర్ల మధ్య 'జాజికాయ...' పాట చేయాలని చెప్పగానే భయమేసింది. ఇలాంటి మాస్ బీట్ నాకు కొత్త. రెండు రోజులు రిహార్సల్స్ చేయగానే మోకాళ్లు నొప్పిచేశాయి. ఫిజియోథెరపీ తీసుకుని పాటను పర్ఫెక్ట్‌గా చేయడానికి కష్టపడ్డా. ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేయడం నా ఫైనల్ గోల్" అని ఆమె చెప్పింది. ఆధ్యాత్మిక కథలు ఎందుకు వరుసగా వస్తున్నాయన్న ప్రశ్నకు—"నేను ఎంచుకున్నవి కాదు, అలాంటి కథలే నా దగ్గరకు వస్తున్నాయి. చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక చింతన నాలో ఎక్కువ. కెరీర్‌లో దారి చూపమని దేవుణ్ణి అడిగిన రోజే శివుడి పేరున్న పాత్ర చేసే అవకాశం రావడం ప్రత్యేకం" అని తెలిపారు. బాలకృష్ణతో పనిచేసిన అనుభవం గురించి మాట్లాడుతూ—"బాలయ్య అంటేనే ఎనర్జీ. సెట్‌లో ఒక్క రోజూ ఒత్తిడి అనిపించలేదు. డైరెక్టర్ చెప్పిందే చేస్తారు. ఆయనలో ఉన్న ఆ డెడికేషన్ నాకు చాలా నచ్చింది" అని అభిప్రాయపడ్డారు.

## అలాంటి వారిని

# కఠినంగా శిక్షించాలి : రష్మికా మందన్నా



ఏఐ టెక్నాలజీ వచ్చిన తరువాత మహిళలకు జరుగుతున్న అన్యాయాలు ఎక్కువయ్యాయి. ఇదే విషయంపై నటి రష్మికా మందన్నా ఆందోళన వ్యక్తం చేశారు. ఎవ్వరూ సురక్షితంగా లేరని అన్నారు. సాంకేతిక అభివృద్ధి మానవ సమాజం అభివృద్ధికి గొప్ప సహకారం అందించినప్పటికీ, అదే సమయంలో పతనానికి కూడా కారణమవుతుంది. ఈ సాంకేతికతను దుర్వినియోగం చేయడం ద్వారా డబ్బులు సంపాదిస్తున్నారు. మోసం, వ్యక్తులను మార్ఫింగ్ చేయడం ద్వారా అసభ్యంగా చిత్రీకరించడం వంటి అనేక రకాల నేరాలకు కొంతమంది నిరంతరం పాల్పడుతున్నారు. దీనిని నిరోధించడానికి ఎన్ని చర్యలు తీసుకున్నా, కఠినమైన శిక్షలు విధించినా నేరాలు తగ్గడం లేదు. సాంకేతికత పెరుగుదుల మనిషి ఎదుగుదలకు దన్నుగా నిలవాలని వారికిని తొక్కే పరిస్థితికి రాకూడదని నేషనల్ క్రష్, నటి రష్మికా మందన్నా అభిప్రాయపడ్డారు. ఇప్పుడు వృద్ధి చెందుతున్న ఏఐ సాంకేతికతను సరైన విధంగానే ఉపయోగిద్దామని సూచించారు.

**ఏఐ సాంకేతికత దుర్వినియోగం**

ముఖ్యంగా ఏఐ సాంకేతికత వచ్చిన తర్వాత, అందులో జరిగే అనేక అవాంఛనీయ ఘటనలు మహిళలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. సెలబ్రిటీల నుంచి సాధారణ మహిళల వరకు ఎవరూ ఈ బుల్లీయింగ్ నుంచి తప్పించుకోలేకపోతున్నారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయంగా మారింది. ఏఐ సాంకేతికత ఏది, నిజం ఏది అని తెలియని విధంగా దాని అభివృద్ధి ఉండటంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. అలాంటి ఏఐ సాంకేతికత కారణంగా ప్రముఖ నటి రష్మికా మందన్నా ఇబ్బంది పడ్డారు. అందుకే దీనిపై ఆమె ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రష్మికా మందన్నా విజ్ఞప్తి**

సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టులో" నిజం సృష్టించగలిగేది అయితే విచక్షణ మన గొప్ప రక్షణగా మారుతుంది. AI అనేది అభివృద్ధికి ఒక శక్తి, అయితే దానిని దుర్వినియోగం చేయడం, మహిళలను లక్ష్యంగా చేసుకోవడం కొంతమందిలో నైతిక పతనాన్ని సూచిస్తుంది. ఇంటర్నెట్ ఇకపై నిజానికి ప్రతిబింబం కాదని గుర్తుంచుకోండి. ఇది ఏదైనా కల్పించగల ఒక కాన్వాస్." అని అభిప్రాయపడ్డారు. అంతే కాకుండా బాధ్యతాయుతంగా ఉందామని పిలుపునిచ్చారు రష్మిక.... "దుర్వినియోగానికి అతీతంగా ఎదిగి, మరింత గౌరవప్రదమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించడానికి AIని ఉపయోగిద్దాం. బాధ్యతారహితంగా ఉండటానికి బదులుగా బాధ్యతగా ఉందాం. కొందరు మానవులుగా ప్రవర్తించలేకపోతే, వారికి కఠినమైన క్షమించరాని శిక్ష విధించాలి" అని తెలిపారు. ఏఐ బారిన పడిన వారిలో రష్మిక మొదటి స్థానంలో ఉంటారు. 2023లోనే ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి డీప్ ఫేక్ ద్వారా ఫేక్ వీడియోలు సృష్టించారు. తనను అసభ్యంగా చిత్రీకరిస్తూ వీడియో విడుదలైనప్పుడు రష్మికా మందన్నా అప్పుడు కూడా చాలా బాధపడ్డారు. ప్రస్తుత కాలంలో సాంకేతికత చాలా రాంగ్ వేలో వినియోగిస్తున్నారని అన్నారు. పాఠశాల, కళాశాల రోజుల్లో ఇలాంటి వీడియో విడుదలై ఉంటే ఎలా ఎదుర్కొనేదానినో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ఇప్పుడు మానసికంగా ఇలాంటి వాటికి తట్టుకొని నిలబడే శక్తి వచ్చిందని అన్నారు. మరికొందరు ఇలాంటి వాటి బారిన పడకుండా ఉండేందుకు ముందుగానే చర్యలు తీసుకోవాలని అప్పట్లో విజ్ఞప్తి చేశారు. ఆ వీడియో తర్వాత ప్రభుత్వాలు స్పందించాయి. అప్పటి నుంచి ఇలాంటి కంటెంట్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం డీప్ ఫేక్, ఏఐ ద్వారా విడుదలయ్యే వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే వీడియోలను తొలగించి, తగిన చర్యలు తీసుకుంటోంది.

# 'అఖండ 3' టైటిల్ లీక్.. తమన్ ట్వీట్ వైరల్




నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ 2' చిత్రం డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధంగా ఉంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రీమియర్ షోలు సైతం ఖరారయ్యాయి. అయితే ఈ సినిమా సీక్వెల్ అంఖడ2తో ఆగదని, దీనికి కొనసాగింపు ఉంటుదంటూ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చమొదలైంది. ఈ మూవీ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ చేసిన ట్వీట్ ఆ చర్చకు కారణమైంది. దీంతో అసలు తమన్ ఏం ట్వీట్ చేశారు? ఇది నిజమేనా? అంటూ నెటీజన్లు తెగ సెర్చ్ చేస్తున్నారు.

ఇంతకీ ఆ పోస్ట్ ఏంటంటే!

అఖండ 2కు సంగీతాన్ని అందించిన తమన్ బుధవారం తన ఎక్స్ ఖాతాలో ఒక ట్వీట్ చేశారు. అందులో 'ఓం నమ శివాయ, జై అఖండ. శివ గర్జన ఈసారి మరింత బలంగా ఉంటుంది. దాన్ని థియేటర్‌లలో చూడడానికి అందరూ సిద్ధంగా ఉండండి, అన్ని పనులు పూర్తయ్యాయి' అంటూ తమన్ రాసుకొచ్చారు. ఈ క్రమంలో తమన్, బోయపాటి వెనకాల ఉన్న స్క్రీన్‌పై 'జై అఖండ' అని రాసి ఉన్న ఓ ఫొటో ప్రస్తుతం అభిమానుల్లో చర్చకు కారణమైంది. దీంతో బాలయ్య అభిమానులు అఖండ పార్ట్ 3 కూడా ఉంటుందని భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా ఇటీవల తమన్ ఓ కార్యక్రమంలో బాలకృష్ణపై తనకున్న అభిమానాన్ని వెల్లడిస్తూ సీక్వెల్స్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. అఖండ పార్ట్ 1లోనే కథంతా అయిపోయిందని అందరూ అనుకుంటున్నారని, కానీ ఆ సినిమాను ఐదు పార్ట్‌లైనా తీయవచ్చునని తెలిపారు. అందుకు బాలయ్య కూడా సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు. శివుడి గురించి ఎంత చెప్పినా తక్కువేనని ఈ సందర్భంగా తమన్ పేర్కొన్నారు. మరోవైపు బాలకృష్ణ నటించే సినిమాలకు సంగీతం అందించే అవకాశం తనకు వచ్చిందని, బాలయ్య తనను ఎప్పుడు కలిసినా 'ఈ సినిమాలో కొత్తగా ఏం చేస్తున్నావ్' అని ఆప్యాయంగా అడుగుతారని తమన్ చెప్పుకొచ్చారు.

కాగా, ఈ చిత్రానికి సంబంధించి ట్రైలర్, పాటలకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. బాలయ్య బోయపాటి కాంబోలో తెరకెక్కుతున్న నాలుగో చిత్రం అఖండ 2. దీంతో అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. బోయపాటి శ్రీను స్క్రీన్‌ప్లే, బాలయ్య అదిరిపోయే డైలాగులు, హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ సీన్స్, తమన్ బీజీయమ్ కలిస్తే ఫ్యాన్స్‌కు పండగేనని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రాన్ని 3డీలోనూ రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. బాలయ్య అభిమానులకు, ప్రేక్షకులకు మంచి అనుభూతి ఇవ్వాలన్న ఉద్దేశంతో 'అఖండ 2' సినిమాను 3డీ ఫార్మాట్‌లోనూ తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు 'అఖండ 2' చిత్రాన్ని 3డీలోనూ రిలీజ్ చేయనున్నట్లు మూవీ టీమ్ ఇదివరకే పేర్కొంది. ఇందుకు సంబంధించి స్పెషల్ పోస్టర్‌ను కూడా ఇటీవల రిలీల్ చేశారు. ఈ సినిమాను దేశమంతా చూడాలని అనుకుంటున్నట్లు, అందుకే పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తున్నట్లు బోయపాటి శ్రీను తెలిపారు.

# అత్తింటిలో సమంతకు ఘన స్వాగతం



ప్రముఖ నటి సమంత తాజాగా వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ప్రముఖ దర్శకనిర్మాత రాజ్ నిడిమోరును ఆమె వివాహం చేసుకున్నారు. గత కొంతకాలంగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలకు తెరదించుతూ, కోయంబత్తూరులోని ఇషా ఆశ్రమంలో వీరి పెళ్లి వేడుక ఆధ్యాత్మిక వాతావరణంలో నిరాడంబరంగా జరిగింది. పెళ్లికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, రాజ్ కుటుంబంతో సమంత దిగిన ఒక ఫ్యామిలీ ఫొటో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. రాజ్ సోదరి శీతల్ నిడిమోరు ఈ ఫొటోను పంచుకుంటూ, "శివుడి ఆధ్వర్యంలో ఈ పెళ్లి జరగడం ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. దీనికి సమంత 'లవ్ యూ' అని బదులివ్వడంతో వారి కుటుంబ బంధంపై అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సమంత క్రిస్టియన్ అయినప్పటికీ, హిందూ సంప్రదాయాలను గౌరవిస్తూ లింగ భైరవి దేవత ఆలయంలో వివాహం చేసుకోవడం విశేషం. గతంలో తాను ఎదుర్కొన్న కష్ట సమయాల్లో లింగ భైరవి అమ్మవారి దర్శనం, ధ్యానం తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని సమంత బలంగా నమ్ముతారు. అందుకే తన కొత్త జీవితాన్ని అదే పవిత్ర స్థలం నుంచి ప్రారంభించాలని ఆమె నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ఈ జంట ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com